ప్లాస్టిక్ మయం



పట్టణంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు(ఫైల్)



ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన మున్సిపల్ డంపింగ్ యార్డు

- ప్రమాదకరమని తెలిసినా రహస్యంగా అమ్మకాలు
- కర్ణాటక నుంచి భారీగా దిగుమతి
- అధికారులు దాడులు చేస్తున్నా ఫలితం శూన్యం

పలమనేరు పురపాలక సంఘం పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్లాస్టిక్ అమ్మకాలపై నిషేధం విధించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కొందరు హోల్‌సేల్ వ్యాపారులు అధికార పార్టీ నేతల అండతో కర్ణాటక నుంచి భారీగా ప్లాస్టిక్ కవర్లను తెప్పించి స్థానికంగా అమ్ముతున్నట్టు తెలుస్తోంది. గతంలో మున్సిపల్ డంపింగ్ యార్డుకు వెళ్లే చెత్తలో ఐదుశాతం కంటే తక్కువగానే ప్లాస్టిక్ కవర్లు కనిపించేవి. ఆరు నెలలుగా వాటి శాతం 30 శాతం దాకా పెరిగినట్టు అధికారుల లెక్కలనుబట్టి తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మున్సిపాలిటీలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఆయన బదిలీ అయ్యాక అధికారుల నిర్లక్ష్యం కారణంగా మళ్లీ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు మొదలయ్యాయి. దీనికితోడు స్థానికంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై గట్టిగా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

-పలమనేరు

క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్



సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆదినారాయణ

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టుల్లో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆదినారాయణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాజీ మార్గమే రాచమార్గమన్నారు. కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో ప్రీలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే చెక్ బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహ హింస తదితర సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు అవకాశముందన్నారు. పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషి చేయాలని సూచించారు.

తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని పులిచెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్షిత్ అభియాన్ కింద పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలుచేస్తోందన్నారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆశా వర్కర్, ఆరోగ్య కార్యకర్త వద్ద పేరు నమోదు చేసుకుని పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలన్నారు. తగిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అప్పుడే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, ప్రమీల పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ అమ్మవారు

పలమనేరు: పట్టణంలోని గంటావూరులో వెలసిన సమయపురి మారెమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు జాకెట్ పీస్‌లు, పసుపు, కుంకుమ అందజేశారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో వెలసిన గంగమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు జంతుబలులు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో ఏకాంబరం ఏర్పాట్లు చేశారు.

టిడ్కో గృహ సముదాయంలో పారిశుద్ధ్య పనులు

పుంగనూరు: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు పుంగనూరులోని టిడ్కో గృహ సముదాయాల్లో బుధవారం మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. అలాగే కాలువలను శుభ్రం చేశారు. క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



కుమార్ మృతదేహం

పెద్దపంజాణి : మండలంలోని బట్టందొడ్డి పంచాయతీ గడ్డూరులో బుధవారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ధనుంజయ రెడ్డి కథనం మేరకు.. గడ్డూరుకు చెందిన కె.కృష్ణప్ప కుమారుడు కె.కుమార్(25) అదే గ్రామానికి చెందిన చిట్టెమ్మను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. ఇద్దరూ మద్యం తాగి తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో కుమార్ బుధవారం గ్రామంలోని తన రేకుల ఇంటికి సపోర్టుగా అమర్చిన ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. తమ్ముడి మృతిపై అనుమానం ఉందని సోదరుడు దొరస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చెరువుల్లో దర్జాగా మట్టి తవ్వకాలు



చౌడేపల్లె చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

- సమాచారమిచ్చినా పట్టించుకోని అధికారులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

చౌడేపల్లె: అధికార పార్టీ నేతలు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. సంపాదనే ధ్యేయంగా చెరువుల్లో అక్రమంగా జేసీబీలతో మట్టి తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టిని తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చౌడేపల్లె చెరువులో జేసీబీతో తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. ఇప్పటికే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు గోతుల్లో ప్రజలు, పాడి ఆవులు పడి పైకి రాలేక మృత్యువాత పడే అవకాశం వుందని చెబుతున్నారు. అంతేగాక చెరువు కట్ట బలహీనంగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



పెద్దూరు చెరువులో మట్టిని తవ్వడంతో ప్రమాదకరంగా మారిన గుంతలు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు



రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ అలీ, ఇతర ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మీ, సుజాత, ఉపాధ్యాయులు అక్బర్‌బాషా, మహ్మద్ అలీ, దేవకీయశోద, అమరనాయక్, ఖాశీంరజ్వీ, శ్రీనివాసులు రెడ్డి, నాగరాజ, విజయలక్ష్మీ, రిజ్వానా బేగం, లీలావతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వి.కోట: సచివాలయ సిబ్బంది నిష్పక్షపాతంగా పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పనిచేయని వీధి లైట్ల స్థానంలో కొత్తవి వేయాలన్నారు. మురుగు కాలువలు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయించి ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. పంచాయతీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని, వర్కులు చేసి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు మంజూరుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ తమీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మిలాద్ ఉన్ నబీ వేడుకలు

పుంగనూరు: పట్టణంలోని కుమ్మరి వీధి మకాన్ వద్ద గురువారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే అన్నదానం చేస్తామని, రాత్రి 8 గంటలకు మత గురువులు ప్రవక్త చరిత్రను వివరిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థినులు సమాజాన్ని పరిశీలించాలి



మాట్లాడుతున్న సీడీపీవో ఉమారాణి

పలమనేరు: విద్యార్థినులు విద్యతోపాటు సమాజాన్ని పరిశీలించి పలు విషయాలు తెలుసుకోవాలని సీడీపీవో ఉమారాణి తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం సంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జండర్ సెన్సిటైజేషన్, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయశంకర్, మెప్మా సిబ్బంది బాబా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ డీఈగా వెంకటయ్య



పుంగనూరు: పుంగనూరు డివిజన్ ఆర్‌అండ్‌బీ డీఈగా వెంకటయ్య బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆదోని నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన గతంలో పుంగనూరులో జేఈగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ పుంగనూరు డివిజన్ పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో రోడ్లు గుంతలు పడడం సహజమని, వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు.

ఏపీ డబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా సైపుల్లా

పుంగనూరు: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీ డబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. వారు బుధవారం పుంగనూరులో ఏపీ డబ్ల్యూజేఎఫ్ సభ్యుల సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సైపుల్లా, ప్రధాన కార్యదర్శిగా తల్లా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. వారిని పలువురు జర్నలిస్టులు అభినందించారు.

చురుగ్గా భజన మందిర నిర్మాణం

వి.కోట: పట్టణంలోని శ్రీరామ ఆలయ ప్రాంగణంలో భజన మందిరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని రామభక్తులు తమ సొంత నిధులతో భజన మందిరాన్ని నిర్మించాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకు దాదాపు రూ.60 లక్షలతో పనులు చేపట్టారు. శ్రీసీతా సమేత రామ లక్ష్మణుల ఆలయంతో పాటు, భజన మందిరాన్ని నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నర్సులు సేవా దృక్పథంతో పనిచేయాలి



నర్సింగ్ స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న డీఎంఅండ్ హెచ్‌వో సుధారాణి

గుడుపల్లె: నర్సులు సేవా దృక్పథంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యా శాఖాధికారి సుధారాణి తెలిపారు. పీఈఎస్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం నర్సింగ్ కళాశాల 16వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నర్సులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుని నైతికతతో ప్రజలకు సేవ చేయాలన్నారు. ఆధారపూర్వకమైన వైద్య పద్ధతులను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం 2022–23 బ్యాచ్‌కు చెందిన 94 మంది నర్సింగ్ విద్యార్థులు, ఒక ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థికి డిగ్రీ పట్టాలు అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కాలిఫోర్నియా పబ్లిషింగ్ సంస్థతో ఒప్పందం



సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుంటున్న మదర్ థెరీసా కళాశాల యాజమాన్యం

గంగవరం: కాలిఫోర్నియాలోని అంతర్జాతీయ పబ్లిషింగ్ సంస్థతో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్టు మండలంలోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఆయన బుధవారం కళాశాలలో కాలిఫోర్నియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల తమ కళాశాలకు చెందిన అధ్యాపకులు రచించిన పుస్తకాలు, అంతర్జాతీయ కాన్ఫరెన్స్ విషయాలు, వ్యాసాలను జర్నల్స్‌లో ముద్రించేందుకు వీలవుతుందన్నారు. అంతేగాక సీఎస్ఈ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కుమార్ అనే విద్యార్థికి రూ.40 వేల ఫెలోషిప్ మంజూరు చేసిందన్నారు. అందులో మొదటి విడతగా రూ.20 వేలు విద్యార్థికి అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సుల్లేక జనానికి తప్పని తిప్పలు



బస్సుల్లేక బోసిపోయిన పలమనేరు ఆర్టీసీ బస్టాండు

- సీఎం సభకు తరలిన ఆర్టీసీ బస్సులు
- ఆటోలను ఆశ్రయించిన ప్రజలు

పలమనేరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న చర్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆయన ఎక్కడ సభ నిర్వహించినా ఆర్టీసీ బస్సులను తరలిస్తున్నారు. అనంతపురంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభకు చిత్తూరు జిల్లాలోని డిపోల్లోని 80 శాతం బస్సులను తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పలు మార్గాల్లో బస్సు సర్వీసులు నడపలేని పరిస్థితి నెలకొంది. పలమనేరు డిపోలో మొత్తం 59 సర్వీసులు ఉండగా, సీఎం సభకు 41 బస్సులను పంపించారు. అలాగే కుప్పం డిపోలో 65 బస్సులు ఉండగా 45 బస్సులను అనంతపురానికి పంపారు. ఫలితంగా బస్సులు లేక ఆర్టీసీ బస్టాండ్లు బోసిపోయాయి. పలు రకాల పనుల నిమిత్తం వచ్చిన మహిళలు, ప్రజలు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధికంగా చార్జీలు చెల్లించి ఆటోల్లో వెళ్లాల్సి వచ్చింది. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వచ్చి వెళ్లే విద్యార్థులు బస్సుల్లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పలమనేరులో దొంగల హల్‌చల్

పలమనేరు పట్టణంలో ఇటీవల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఇళ్లతోపాటు ద్విచక్ర వాహనదారులు, నడిచి వెళుతున్న వారిపై దాడి చేసి బంగారు నగలు, నగదు దోపిడీ చేస్తున్నారు. వారి వద్ద ఏమీ లేకుంటే సెల్‌ఫోన్లను సైతం వదలడం లేదు. పోలీసులు రాత్రిళ్లు గస్తీ తిరుగుతున్నా ఫలితం లేదు. ఇటీవల ఇద్దరు టీడీపీ నేతల ఇళ్లలో భారీ చోరీలు జరిగాయి. వీటిని ఎవరు చేశారో ఇప్పటిదాకా పోలీసులు కనుక్కోలేకపోయారు. దీంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

- ఒకే తరహాలో రెండు భారీ చోరీలు
- జనాన్ని కొట్టి దోపిడీ చేస్తున్న వైనం
- కేసుల ఛేదనలో పోలీసుల అలసత్వం

పలమనేరు: గత నెలలో దొంగలు పలమనేరు పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్వీ బాలాజీ ఇంట్లో చోరీ చేశారు. దుండగులు ఇంటి కిటికీలు తొలగించి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఈ కేసులో ఎన్నికోట్లు చోరీ జరిగిందనే విషయం ఇప్పటి వరకు పోలీసులు బయటపెట్టలేదు. దుండగుల ఆచూకీని గుర్తించలేదు. మరోవైపు గతనెల 31న స్థానిక రాధా బంగ్లా వీధిలోని మరో టీడీపీ నేత సాకేపూరు రామ్మూర్తి నాయుడి ఇంటి వెనుక డోర్ తాళం పగులగొట్టి ఇంట్లోని బంగారు, నగదును చోరీ చేశారు. ఈ కేసులోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నా ప్రయోజనం లేదు.



రామ్మూర్తినాయుడి ఇంట్లో జరిగిన చోరీ (ఫైల్)

తమిళనాడు దొంగల పనేనా?

టీడీపీ నేతల ఇళ్లల్లో జరిగిన చోరీలను గమనిస్తే రెండూ ఒకేలా వున్నాయి. అక్కడున్న సీసీ కెమెరాలను తొలగించడంతో దొంగల ఆచూకీ పోలీసులకు కష్టంగా మారింది. దొంగలు ప్రొఫెషనల్ అని, తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా విచారణ చేస్తున్నట్టు సమాచారం.

నడుచుకుంటూ వెళ్లేవారిని వదలని వైనం

దొంగలు ఒంటరిగా నడిచి వెళుతున్న వారిని సైతం వదలడం లేదు. తాజాగా పట్టణంలోని గుడియాత్తం రోడ్డుపై వెళుతున్న రఫీపై నలుగురు వ్యక్తులు దాడిచేసి అతని వద్దనున్న నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అలాగే పట్టణ సమీపంలోని చరణ్ దాబా వద్ద వెళ్తున్న గణేష్ అనే వ్యక్తిపై దాడి చేసి అతని వద్దనున్న సెల్, రూ.18 వేలు దోపిడీ చేశారు. పోలీసులు ఈ కేసుల్లో దొంగలను పట్టుకున్నా వారి వెనుకనున్న ముఠా గురించి పట్టించుకోలేదని తెలుస్తోంది. అంతేగాక వారి నేరప్రవృత్తి, పాత కేసులపై పెద్దగా దృష్టి పెట్టలేదని సమాచారం. ఏది ఏమైనా ఇటీవల పలమనేరు పట్టణంలో జరుగుతున్న చోరీలతో జనం భయపడుతున్నారు. పోలీసింగ్ సరిగ్గాలేకనే ఇలాంటి చోరీలు యథేచ్ఛగా సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇటీవల విధుల్లో చేరిన సీఐ మురళీమోహన్ చోరీ కేసులపై దృష్టి సారించి దొంగల పనిపట్టాలని కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

నేడు హుండీ కానుకల లెక్కింపు

చౌడేపల్లె: పట్టణంలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించనున్నట్టు ఈవో కమలాకర్ తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు ఎంపీ జన్మదిన వేడుకలు

చౌడేపల్లె: రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం చౌడేపల్లెలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఇందులో పార్టీ శ్రేణులు, పెద్దిరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండులో గురువారం వైఎస్సార్ సీపీ యువ నాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీం బాషా తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.